క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లె గ్రామ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రజలతో మమేకమవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్‌హబ్‌ను నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ అబ్దుల్ అన్నారు. బుధవారం ఐటీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పన కోసం స్కిల్ హబ్ సంస్థ ద్వారా రాష్ట్రప్రభుత్వం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఇతర విద్యార్హత కలిగి, 18- 35 ఏళ్లలోపు వయసు ఉన్న వారు రిజిస్ట్రేషన్ కోసం 81425 09017 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి ఉన్నారు.

ఆంగ్ల బోధనపై టీచర్లకు శిక్షణ


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

నిండ్ర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో ఆంగ్లభాషను బోధించేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బుధవారం జరిగింది. ఈ శిక్షణలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బోధనపై శిక్షకులు ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. ఎంఈఓ శ్రీధర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లిష్ సులభంగా నేర్పించడంపై శిక్షణ ఇచ్చామన్నారు. దీంతో విద్యార్థులకు ఆంగ్లభాషపై భయం పోయి సులభంగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. గర్భధారణ పరీక్షల సమయంలో ఆస్పత్రికి వచ్చేవారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్కేరోజా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్ఎంఓ కార్తిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ పాల్గొన్నారు.

మూడో విడతలో మరమ్మతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెనుమూరు మండలం సన్యాసిపల్లి, దార్వగానిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మూడో విడత నాడు–నేడు పనుల్లో మరమ్మతులు చేయనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ పాఠశాలల్లో 20 మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉండడంతో నాడు–నేడు మొదటి, రెండవ దశల్లో ఎంపిక కాలేదన్నారు. మూడవ విడత పనుల జాబితాలో ఆ రెండు పాఠశాలల్లో మరమ్మతులు, ఇతర సౌకర్యాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మునికృష్ణయ్య



పుత్తూరు రూరల్: బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పుత్తూరుకు చెందిన సి.మునికృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏలూరులో సంఘ రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విఠల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌తో పాటు పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న మునికృష్ణయ్య ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు తోపు వేలం

పుత్తూరు రూరల్: స్థానిక ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ తోపు ఆవరణ స్థలం బహిరంగ వేలం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 18వ తేదీ నుంచి 28 వరకు 10 రోజుల పాటు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ఈ సందర్భంగా తోపు ఆవరణలో తాత్కాలిక అంగళ్ల నిర్వహణ కోసం దేవదాయ శాఖ అధికారులచే వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.1 లక్ష ధరావత్తు చెల్లించాలని స్పష్టం చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి

- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశాం
- పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించాం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: పేదల సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించండి అని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పచ్చికాపల్లంలో పెద్దపోటుచేను, నక్కలాంపల్లె, చిన్న నక్కలాంపల్లె, చిన్నపోడుచేను, జీఎంపల్లె గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల లబ్ధిపై ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో ఇలాంటి సంక్షేమ పథకాలు ఎప్పుడైనా ఇచ్చారా ? అని లబ్ధిదారులను అడిగారు. ప్రజలకు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వంపై టీడీపీ నేతలు విమర్శలు అర్థరహితమన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలుస్తోందని తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు, సిమెంటు రోడ్డు వేశామని గుర్తు చేశారు. పచ్చికాపల్లం పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా పెంచేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంత అభివృద్ధి చేస్తున్నా టీడీపీ నేతలు కళ్లు లేని కబోదుల్లా ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

సక్రమంగా పని చేయండి.. లేదంటే వెళ్లిపోండి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఈ సందర్భంగా ఏపీఎం కవిత తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా పని చేయండి..లేదంటే సెలవుపెట్టి వెళ్లిపోవాలంటూ చురకలు అంటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కొందరు సంఘమిత్ర సభ్యులు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు. నిజాయతీగా పనిచేస్తున్న వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నారన్న సమాచారం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటివి మరోమారు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ఏపీఎంను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా విద్యుత్ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, గ్రామాల్లో ఏం పనులు చేస్తున్నారో అర్థం కావడం లేదని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి గ్రామాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని విద్యుత్‌శాఖ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. అదేవిధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నక్కలాంపల్లెలోని ఆలయానికి అదనంగా మరో రూ. 5లక్షలు మంజూరు చేయిస్తానని డిప్యూటీ సీఎం గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంపీపీ నాగరాణి, ఎంపీడీఓ సుధాకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, పారిశ్రామిక వేత్త రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, మండల యూత్ అధ్యక్షుడు బి.నరేష్‌రెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, ఏఎంసీ డైరెక్టర్ అత్తూరు సురేష్‌రెడ్డి, పంచాయతీ కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు పుష్ప, మునిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్ కుమారి, ఉప సర్పంచ్ ఈశ్వరరెడ్డి, నాయకులు నాయకులు ధనంజయ రెడ్డి, రామయ్య, భీమశంకర్‌రెడ్డి, రోశిరెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రోశయ్య, నాగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పుత్తూరులో రూ.63 కోట్లతో అభివృద్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

- తెలంగాణలో కూర్చుంటే అభివృద్ధి ఎలా కనిపిస్తుంది ?
- సమావేశాలకు డుమ్మా కొట్టి పచ్చపత్రికల్లో తప్పుడు ప్రచారాలా?
- టీడీపీ కౌన్సిలర్ బసంతిపై నిప్పులు చెరిగిన చైర్మన్ హరి
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

పుత్తూరురూరల్: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఒక్క పుత్తూరులో రూ.63 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఇటీవలే ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం ద్వారా ఒక్క పుత్తూరులో సుమారు 7 వేల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ హరి అన్నారు. బుధవారం హరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బసంతి తెలంగాణలో కూర్చుని పుత్తూరులో అభివృద్ధే జరగలేదని, మంత్రి రోజమ్మ సమాధానం చెప్పాలంటూ ప్రకటనలు చేయడంపై విరుచుకుపడ్డారు. నెలకోమారు జరిగే మున్సిపల్ సమావేశాలకు సైతం డుమ్మాకొట్టే ఈమె అభివృద్ధి, ఆత్మవిమర్శ అంటూ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి జరగలేదంటూ పచ్చపత్రికల్లో మాట్లాడిన టీడీపీ కౌన్సిలర్ బసంతికి దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో నిలబడాలని ఆయన సవాల్ విసిరారు.

శరవేగంగా ఎస్ఎస్ ట్యాంకు పైపులైన్ పనులు

పుత్తూరుకు అత్యంత ప్రధానమైనది రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రూ.2 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణం, రూ.1.85 కోట్లతో షాదీమహల్, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, రూ.1.10 కోట్ల ఆధునిక శ్మశాన వాటిక నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. పుత్తూరులో ఇంత అభివృద్ధి జరుగుతున్నా టీడీపీ నాయకులకు కనిపించట్లేదని, వారు కళ్లున్న కబోదులని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ జయలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ కౌన్సిలర్ బసంతిని ఆ వార్డు ప్రజలు నమ్మి గెలిపిస్తే ఆమె హైదరాబాద్‌లో నివాసం ఉంటూ గెలిపించిన ప్రజలకు గాలికి వదిలేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆమె వార్డును విస్మరించినా మంత్రి రోజమ్మ ఆదేశాల మేరకు పార్టీలకు అతీతంగా ఆ వార్డులోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అందరూ హాజరు కాగా, ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లకు గానూ ముగ్గురు సమావేశానికి డుమ్మా కొట్టడంతో మిగిలిన ఇద్దరు టీడీపీ కౌన్సిలర్లు సభలో మౌనం వహించారు.


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు..

- జనరల్ ఫండ్స్ నుంచి రూ.69,26,696తో 8 సీసీ డ్రైన్ వర్కులకు ఆమోదం
- 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.49,95,138లతో విద్యుత్ దహన యంత్రం కొనుగోలుకు ఆమోదం
- జనరల్ ఫండ్స్ నుంచి రూ.19,64,031తో 5 వాటర్ సప్‌లై పనులకు ఆమోదం
- నగరం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి చెర్లోపల్లి గ్రామం వరకు రూ.27,15,537తో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం

సీఎం జగనన్న పాలన అద్భుతం



నగరి : సర్టిఫికెట్లు అందుకున్న వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : సొంత అన్నకన్నా ఎక్కువగా సీఎం జగనన్న ప్రజలకు సేవలందిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం నగరి వెస్ట్ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన 574 మందికి వివిధ రకాలైన సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజల అవసరాలు తీరుస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పార్టీలు చూడకుండా, కులమతాలకు అతీతంగా తలుపు తట్టి మరీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే అన్నారు. సీఎం జగనన్న పాలన అద్భుతమని కొనియాడారు. ఆయనకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, జ్యోతి, అమర్, డీఈ నరేష్, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఓ వరం

విజయపురం (నగరి) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం రాష్ట్ర ప్రజలకు ఓ వరం లాంటిదని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్రీహరిపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎంగా జగనన్న ఉన్నంతవరకు ప్రజలకు ఎలాంటి లోటు ఉండదన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన నాయకులు చేయలేని అభివృద్ధిని గత నాలుగేళ్లలో జగనన్న చేసి చూపించారని కొనియాడారు. అలాగే ఈ నాలుగేళ్లలో శ్రీహరిపురం పంచాయతీలో రూ.8.93 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం 250 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘ సభ్యులకు శిక్షణ


సంఘ సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం రోజా

శ్రీరంగరాజపురం : మండలంలోని వెలుగు కార్యాలయంలో ఫైనాన్సియల్ పాలసీపై సంఘమిత్రలకు, ఎంఎస్ కార్యవర్గ సభ్యులకు, గ్రామ, మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం రోజా, సీసీ లావణ్య మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను బలపరచడంతో పాటు సుస్థిరం చేయడానికి ఆర్థిక విధానాలు, సంస్థ సామర్థ్యాలను పెంపొందించడానికే రెండు రోజుల శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఆర్థిక అత్యుత్తమ పాలసీ ప్రమాణాలను రూపకల్పన చేసి సంఘాల అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సుధాకర్, శకుంతల, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే ప్రభుత్వ వైద్యసేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ వైద్యసేవలను అందించడమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. బుధవారం పద్మాపురం సచివాలయం పరిధిలోని ఎస్ఆర్ పురం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య సేవల కోసం వచ్చిన రోగులు, గర్భిణులతో డాక్టర్ పల్లవి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంతో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సు కవిత, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వస్తుసామగ్రి వితరణ


పుత్తూరు రూరల్: మండలంలోని గొల్లపల్లి స్కూల్‌లో బుధవారం 1995–96 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలకు రూ.25 వేలు విలువైన ప్రింటర్‌ను వితరణ చేశారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.
వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ
గొల్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ ఎత్తిరాజులు, సెక్రెటరీ అంజన్ శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

మిత ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పుత్తూరు రూరల్: ప్రతి ఒక్కరూ మిత ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిరాజు అన్నారు. బుధవారం వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం గ్రామంలో సర్పంచ్ మణిరాజు, వాకర్స్ అసోసియేషన్, తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐ కేర్, హియర్ ఇన్‌స్టుమెంట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి తరలివచ్చిన తిరుపతి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 355 మందికి చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పూర్ణచంద్రరావు, జ్యోతి, అభిలాష, స్కూల్స్ హెచ్ఎంలు జయశ్రీ, సుబ్రమణ్యంరాజు, రఘు, అసోసియేషన్ సభ్యులు రవి, హరిరాజు, విజయ్‌కుమార్, శంకర్, కుమార్, వెంకటరామరాజు, నారాయణరాజు, శ్రీనివాసులు, యయాతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంలతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గిరిజ


పాలసముద్రం : మండల పరిధిలోని బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. మంగళవారం ఎమ్మార్సీలో పాలసముద్రం సీఆర్సీ పరిధిలోని హెచ్ఎంలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు స్కూళ్లలో నాడు–నేడు పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్, యూనిఫాం, బూట్లు, టై, బెల్ట్, ఉచితంగా అందించడమే కాకుండా బస్సుపాస్ సౌకర్యం, అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో రూ.14 వేలు జమ చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం


శికారీల పిల్లలను స్కూల్‌లో చేర్చుకుంటున్న హెచ్ఎం

కార్వేటినగరం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని డీసీఈబీ కార్యదర్శి(పాఠశాల హెచ్ఎం) కే.హేమారెడ్డి అన్నారు. బుధవారం శికారీల పిల్లలు కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఆదరణకు సంచార జాతులైన శికారీలు కూడా తమ పిల్లలకు విద్య నేర్పించడానికి ముందుకొస్తున్నారని తెలిపారు. అనంతరం వెదురుకుప్పం మండలం మొరవ గ్రామ సమీపంలో ఉన్న శికారీ కాలనీకి చెందిన ఇద్దరు శికారీలు తమ పిల్లలను పాఠశాలలో చేర్చారు. వారికి అధికారులు వసతిగృహంలో కూడా అవకాశం కల్పించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న సీడీపీఓ వినుతశ్రీ

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీడీపీఓ వినుతశ్రీ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. ముఖ్యంగా బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారిపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

గంగాధరనెల్లూరు: రాష్ట్రప్రభుత్వం సేవలను ప్రజల చెంతకే చేర్చిందని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. బుధవారం గంగాధరనెల్లూరు, బాలగంగనపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దరఖాస్తుల చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. సర్పంచ్‌లు శేఖర్, వీసీ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ఇన్నునాథన్, డీటీ తులసీరామ్, ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.

టెలీకాలర్ ఉద్యోగాలకు 23 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ వేణుగోపాల్


నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో టెలికాలర్ ఉద్యోగాలకు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 23 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 60 మంది హాజరుకాగా మూడు రౌండ్ల ఇంటర్వ్యూలో 23 మందిని ఎంపిక చేశారన్నారు. యువకులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని కంపెనీ ఆపరేషన్ మేనేజర్ ధన్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథి, టీంలీడర్లు ఆనంద్, శ్రీకాంత్, అధ్యాపకురాలు పంకజ, జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


ఉత్తమ విద్యార్థులతో దాతలు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: నేటి సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ తిరుమలరాజు సూచించారు. బుధవారం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఆళ్లూరు కోటయ్య జ్ఞాపకార్థం పదో తరగతిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకుంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. కోటయ్య కుమారులు శ్రీనివాస్ జగదీష్ మాట్లాడుతూ తండ్రి ఆశయానికి అనుగుణంగా ఏటా పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన హాసిని కృష్ణ, హరిత, ధనలక్ష్మికి రూ.2 వేలు వంతున నగదు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు బాలసుబ్రమణ్యం, నరసింహులు, ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్ విరిత, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్మాన్


సంతానం కోసం వరపడుతున్న మహిళలు


గంగాధరనెల్లూరు: తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం/గంగాధరనెల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీరంగరాజుపురం మండల పరిధిలోని చిల్లామాకులపల్లిలో, గంగాధరనెల్లూరు మండల పరిధిలోని బాలగంగనపల్లిలో శ్రీద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. ఈ క్రమంలో పైనుంచి విబూది, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం తపస్సుమాను వద్ద వరపడ్డారు. అర్జున తపస్సు ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా గజేంద్రరెడ్డి, చిట్టిబాబురెడ్డి, పద్మనాభరెడ్డి, ధనంజయరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.